క్లుప్తంగా

14న జాతీయ లోక్ అదాలత్


పి.విజయదుర్గ

నరసాపురం: నరసాపురం కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.వి జయదుర్గ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుదాయని చెప్పారు. పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ చేసుకోదగిన సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకునే విధంగా జాతీయ లోక అదాలత్‌ను విజయవంతం చేయాలని చెప్పారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు


సిద్ధాంతంలో విఘ్నేశ్వర స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో పురాతన విఘ్నేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అభిషేకాలు, అర్చనలు అనంతరం గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వెండి యంత్రం, వెండి శిఖరాలను ఊరేగించారు . ఆలయ అర్చకులు వెలవలపల్లి జానకిరామయ్య శర్మ మాట్లాడుతూ బుధవారం ఉదయం 8.11 నిముషాలకు వెండి యంత్రం, వెండి శిఖర ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ వేడుకగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విఘ్నేశ్వర స్వామికి లక్ష గరిక పూజ నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డీఎన్నార్ కళాశాలలో జాబ్ మేళా


జాబ్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ సహకారంతో సంధ్యా మెరైన్స్ కంపెనీ జాబ్ మేళా ఏర్పాటు చేసింది. ఈ మేళాలో 220 మంది విద్యార్థులు పాల్గొనగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. శోభారాణి, బుద్ధరాజు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సంధ్యా మెరైన్స్ సంస్థ సభ్యులు ఏడుకొండలు, సురేష్‌రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ దాసు

భీమవరం: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జి.దాసు, ఎస్సై నర్సింహారావు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవడమే గాక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ద్విచక్రవాహనాలను నడిపే సమయంతో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, ఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలను వాయిదా వేయాలని నిరసన


వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

భీమవరం: వాణిజ్య పన్నుల శాఖలో జరుగుతున్న బదిలీల ప్రక్రియను వాయిదా వేయాలంటూ ఏపీసీటీ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సీఆర్‌యూ వ్యవస్థను రద్దు చేయాలని, రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా గతంలో జరిగిన బదిలీలను పునః సమీక్షించాలన్నారు.



వైద్యులకు రక్షణ కల్పించాలి



ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసే వైద్యులపైనే దాడులు దురదృష్టకరం. రాత్రి వేళల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటోంది. అందుకే రాత్రివేళ డ్యూటీ అంటేనే వైద్యులు, సిబ్బంది భయపడుతున్నారు. వైద్యులకు నిర్భయంగా సేవలందించే వాతావరణం కల్పించాలి. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యసేవలందుతాయి.

– జి.గణేష్, పిల్లల వైద్యుడు, నరసాపురం ఏరియా ఆసుపత్రి

చాలా భయమేస్తోంది



కోల్‌కతా ఘటన అనంతరం రాత్రిళ్లు ఆస్పత్రుల్లో డ్యూటీ చేయాలంటే భయమేస్తోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఒక్క ఆసుపత్రులు అనే కాదు మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారికి కనీస సౌకర్యాలు, భద్రత కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరం చేసిన వారికి కఠిన శిక్షలు ఉండేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో నిఘా వ్యవస్థ పటిష్ట పరచాలి. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– బి.గరిమా, పెథాలజిస్ట్, నరసాపురం ఏరియా ఆసుపత్రి

భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

- రెండోసారి నాట్లు వేసేందుకు రైతుల విముఖత
- 9,600 ఎకరాలకు గానూ 2వేల ఎకరాల్లోనే సాగు


కొప్పర్రులో నాట్లు వేసిన వరిచేను

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం భారీగా పడిపోయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో చురుగ్గా నాట్లు వేసిన రైతాంగం భారీ వర్షాలతో కుదేలయ్యారు. ముఖ్యంగా భారీ వర్షాలతో పాటు డ్రెయిన్లు కూడా ఉప్పొంగడంతో చేలల్లోనే రోజుల తరబడి నీరు నిలిచిపోయింది. దీంతో నాట్లు కుళ్లిపోయాయి. వర్షాలు తగ్గాక కొందరు రైతులు మళ్లీ నారుమడులు పోసినా చాలా మంది రైతులు మాత్రం నారుమడులు పోసేందుకు ముందుకు రాలేదు. వాతావరణం ఎలా ఉంటుందో? అనే అనుమానంతో ప్రారంభ పెట్టుబడి నష్టంతో బయటపడ్డామని కొంత మంది రైతులు చెబుతున్నారు. అయితే సాగు విస్తీర్ణంగా భారీగా తగ్గడంతో వ్యవసాయ కూలీలు పనులు ఉండవని ఆందోళన చెందుతున్నారు.

రెండు వేల ఎకరాల్లోనే..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అధిక వర్షాలు, వరదలు కారణంగా చాలా చోట్ల ఇంకా నాట్లు వేస్తూనే ఉన్నారు. మండలంలో ఉన్న సాగు భూమి 9,600 ఎకరాలకు గానూ కేవలం రెండు వేల ఎకరాల్లో కూడా పూర్తిస్థాయిలో నాట్లు పడలేదంటే పరిస్థితి ఎలా ఉందో? అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఒక ఎకరం పొలం సాగు చేయాలంటే రూ.30వేల వరకూ వ్యయం చేయాల్సి వస్తోంది. దమ్ము చేయడం మొదలుకుని నాట్లు వరకూ డబ్బులు ఖర్చు పెట్టాల్సిందే. దమ్ము చేసేందుకు ట్రాక్టర్ ఖర్చులు, నాట్లు వేసేందుకు అయ్యే ఖర్చులకు ఖచ్చితంగా డబ్బులు ఎప్పటికప్పుడు సరిపెట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో పెట్టుబడి సమస్యలతో చాలా మంది రైతులు నాట్లు వేసేందుకు ముందుకు రావడం లేదు.

అందని ప్రభుత్వ సాయం

గతంలో పంట ప్రారంభం సమయంలో ఏదైనా నష్టం జరిగితే రైతులకు ఉచితంగా విత్తనాలను అందించే వారు. అలాగే సీజన్ ప్రారంభానికి ముందుగానే పెట్టుబడి సాయం అందించాలని రైతు భరోసా నిధులు అందించే వారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాయం గురించి రైతులు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. అధికారంలోకి వస్తే రూ.20 వేలు సాయం చేస్తామని ప్రకటించిన చంద్రబాబు ఆ దిశగా చర్యలేవీ తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాల వల్ల రెండోసారి నాట్లు వేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

హామీని నిలబెట్టుకోవాలి



ఇప్పుడున్న కూలీ, ట్రాక్టర్ రేట్లతో వ్యవసాయం చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పనే. అందుకు కొంత సాయంగా గత ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెరసి రూ.13,500లను పంట ప్రారంభ రోజుల్లోనే రైతు బ్యాంకు ఖాతాలో జమ చేసేవి. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు వేస్తామని చెప్పడంతో ఖరీఫ్ పనులు ప్రారంభం నుండీ రైతాంగా అంతా ఆ సొమ్ములు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– చినిమిల్లి వీరబాబు, రైతుసంఘం నాయకుడు

రైతులకు కష్టాలు తప్పేలా లేవు



వ్యవసాయం చేయాలంటే వేలల్లో ఖర్చు పెట్టాలి. మళ్లీ 10ఏళ్ల నాటి కష్టాలు మొదలయ్యాయి. నేను రెండెకరాల రైతును, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. గత ప్రభుత్వం రైతు భరోసాతో ఆదుకుంది. ఈ ప్రభుత్వం రూ.20 వేలు వేస్తామని ఎన్నికల ముందు చెప్పారు. వెంటనే డబ్బులు రైతులకు అందజేయాలి. లేకపోతే రైతులకు మరిన్ని ఆర్థిక కష్టాలు తప్పేలా లేవు.

– పిప్పళ్ల ఆదిమూర్తి, రైతు, కొప్పర్రు

ఆక్వా అనుమతులపై అవగాహన



ఆక్వా అనుమతులపై అవగాహన కల్పిస్తున్న మత్స్యశాఖ అధికారులు

పెనుమంట్ర: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మత్స్యశాఖ, ఎంపెడా వారి సంయుక్త ఆధ్వర్యంలో అప్సడా అనుమతులు, ఎంపెడా ఎన్‌రోల్‌మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ ఎల్ఎస్ రాజు మాట్లాడుతూ అప్సడా అనుమతులు తప్పనిసరి, అనుమతులు లేని ఆక్వా రైతులు త్వరితగతిన అనుమతులు పొందాలన్నారు. ఎంపెడా ఏడీ ఆనందరావు మాట్లాడుతూ మన జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తుల కోసం ఎంపెడా వద్ద నమోదు చేసుకోవాలని, ధరల ఆటుపోట్లు, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని సాగు చేయాలని తెలిపారు. ఆక్వా రైతులకు 10 ఎకరాలకు మించిన వారికి విద్యుత్ సబ్సిడీ వర్తింపు జరిగేలా చూడాలని రైతులు కోరారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడా శ్రీనివాస్, మత్స్యశాఖ సిబ్బంది వెంకటలక్ష్మి, రాంబాబు, మురళి, రవికుమార్, బాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సీఐ గుత్తుల శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: మదర్‌థెరిస్సా బాటలో చిరు అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లిలో మంగళవారం మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సీఐ శ్రీనివాస్ మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గ్రామంలోని 150 మంది మహిళలు చీరలు పంపిణీ చేశారు. అలాగే ఎక్కువసార్లు రక్తదానం చేసిన వీరా భాస్కర్, మద్దాల గణేష్, గ్రామంలోని రక్తదాతలకు సీఐ చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యూత్ అధ్యక్షుడు తులా రామలింగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కోపల్లి శ్రీనివాస్, శిడగం సురేంద్ర, మల్లిపూడి జగదీష్, పరిమి వెంకట నవీన్, కడలి స్వామి వెంకటాద్రి, గోగులమటం గణేష్, పోల్నాటి బాలాజీ, పరిమి సాయి, బొంతు పెద్దిరాజు, గుబ్బల కృష్ణ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతతో ప్రజల ఇక్కట్లు

పెనుగొండ: పెనుగొండలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. పెనుగొండ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉదయం 10 గంటల నుంచి సరఫరా నిలిచిపోయింది. వేసవి తలపించే ఉక్కబోతలు ఉండడంతో, దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు పడ్డారు. తాడేపల్లి గూడెం నుంచి పరికరాలు తీసుకువచ్చి మరమ్మతులు చేసినా రాత్రి వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతూనే ఉంది. రావడం, నిలిచిపోవడం జరుగుతుండడంతో ఇబ్బందులు పడ్డారు. గత వారం మార్టేరు పరిసర ప్రాంతాల్లో సైతం ఇదే పరిస్థితి ఎదురుకావడంతో రెండు రోజుల పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ శాఖాధికారులు సైతం నానావస్థలు పడ్డారు. సాయంత్రానికే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించడంతో ఊపిరిపీల్చుకున్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ ఆంజనేయరాజు

కాళ్ల: ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్లలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ పి.ఆంజనేయరాజు సూచించారు. కాళ్ల సచివాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. కాళ్ల మండలంలో ఇప్పటివరకు నిర్మాణ దశలో ఉన్న 198 గృహాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమును క్లోజ్ చేసే అవకాశం ఉందని తెలిపారు. లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బందా విజయ, ఉప సర్పంచ్ పన్నాసి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విల్సన్, పుప్పాల బుజ్జి, బండారు సోమేశ్వరరావు, మొగ్గల షావుకారు, హౌసింగ్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మంగళవారం విలేకరులకు చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

పూర్తి స్థాయిలో తాగునీరందించాలి

మొగల్తూరు: ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో తాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కాళీపట్నం మంచి నీటి ప్రాజెక్టును మంగళవారం ఆయన పరిశీలించి అధికారులతోనూ, గ్రామ పెద్దలతోనూ మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలలో అక్రమ కులాయి కనెక్షన్లు ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ నిధులతో త్వరలో మంచి నీటి ప్రాజెక్టులో ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో తాగు నీరందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బీజేపీ నాయకుడు హనుమంతరావు మృతి

పెనుమంట్ర: బీజేపీ సీనియర్ నాయకుడు గంటా హనుమంతరావు(72) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పెనుమంట్ర మండల బీజేపీ అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా బీజేపీ పాలకవర్గ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గంటా హనుమంతరావు సేవలు అందించారు. హనుమంతరావు మృతి పార్టీకి తీరనిలోటని ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కేహెచ్‌వీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

పోలీసు సిబ్బందికి ఉచిత రక్త పరీక్షలు


భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్‌లో రక్తపరీక్షలకు రక్తం సేకరిస్తున్న దృశ్యం

భీమవరం: పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలరని నిత్యం ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ అన్నారు. మంగళవారం సీఐ కాళీచరణ్ ప్రోత్సాహంతో టుటౌన్ పోలీసు సిబ్బందికి ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కాళీచరణ్ మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటారని ఇలాంటి సమయంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రక్త పరీక్షలు రిపోర్టులు ఆధారంగా వైద్యులను సంప్రదించి వైద్య సహాయం అందించడానికి కృషిచేస్తామని కాళీచరణ్ చెప్పారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం


శిక్షణలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీడీపీవో సీహెచ్ ఇందిర

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు చట్టపరంగా విరుద్ధమని, అలాంటి వివాహాలు ఎక్కడ జరగకుండా అడ్డుకట్ట వేయాలని ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాల నిరోధక అధికారుల శిక్షణ కార్యక్రమం సీడీపీవో సీహెచ్ ఇందిర అధ్యక్షతన నిర్వహించారు. ది ప్రొహిబిషన్ చైల్డ్ మ్యారేజ్ యాక్టు (2006) ప్రకారం బాల్య వివాహాల నివారణకు వధువు, వరుడు తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రం తీసుకోవాలని సీపీఎంఓలకు సూచనలు చేశారు. ప్రతీ బుధవారం ఆయా గ్రామాల్లోనూ, వార్డుల్లో బాల్య వివాహాల నిరోధానికి సంబంధించి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సూచించారు. సీపీఎంఓలంతా టీమ్ వర్కు చేసి బాల్యవివాహాలను నిరోధించాలని కోరారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన వాల్ పోస్టర్‌ని ఆవిష్కరించారు.సమావేశంలో తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, ఎంఈఓ ఆర్ఎస్‌వీఎస్ గంగాధరశర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, జీఎస్ మల్లేశ్వరి, ఎస్.మంగ తదితరులు పాల్గొన్నారు.

కాశీ, అయోధ్య ప్రదర్శనలకు నరసాపురం విద్యార్థులు


కాశీ కూచిపూడి ప్రదర్శన కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

నరసాపురం: సెప్టెంబర్ 1న కాశీ విశ్వనాథ ఆలయం వద్ద, 4న అయోధ్య బాల రాముని ఆలయం వద్ద జరిగే జాతీయస్థాయి కూచిపూడి నృత్యప్రదర్శనలకు నరసాపురం శ్రీ ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు 50 మంది ఎంపికైనట్టు నాట్యాచారిణి వి.అనంతలక్ష్మీదేవి చెప్పారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాశీలో తమిళనాడు ప్రభుత్వం, వారణాశి ఆలయ బోర్డు సహకారంతో ఈ నృత్య ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. అయోధ్యలో మొదటిసారిగా తమ కళాశాల విద్యార్థులు ప్రదర్శనలు ఇవ్వబోతున్నారని వివరించారు. మంగళవారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాశీ ప్రదర్శనలకు సంబంధించి కరపత్రాలు ఎమ్మెల్యే బొమ్మిడ నాయకర్ విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, సీహెచ్ రెడ్డప్పధవేజీ, బాబూశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం


జలశక్తి అభియాన్ ర్యాలీలో పాల్గొన్న ఏఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: పంచభూతాల్లో ఒకటైన నీరు సమస్త జీవకోటికి ప్రాణాధారమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఏ ప్రాణి బతకాలన్నా నీరు అవసరమని అన్నారు. అలాంటి నీటిని సద్వినియోగం కన్నా చాలా మంది దుర్వినియోగం చేస్తున్నారన్నారు. దీనివల్ల భవిష్య తరాలకు తీరని ద్రోహం చేస్తున్నట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అధ్యాపకులు డాక్టర్ యామిని, వంశీ, డి శ్రీనివాస్, విజయలక్ష్మి, ఆశాజ్యోతి, దుర్గేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ గత 30 ఏళ్లగా ఎన్నో పోరాటాలు చేసి నేటికి విజయం సాధించగలిగారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చినబాబు అన్నారు. మంగళవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద వర్గీకరణ 30 ఏళ్ల పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ మంద కృష్ణ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఎన్నో అవమానాలు పడి వర్గీకరణను సాధించారన్నారు. వర్గీకరణ వెనుక మంద కృష్ణతో పాటు అమరవీరుల త్యాగాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాడూరి సువర్ణరాజు, పసల బోసు, వై రత్నరాజు, పలివెల పైడియ్య, పసుపులేటి రాజేష్‌ఖన్నా, శెట్టం జాన్సీ, కొండేటి వరదరాజు, సనమండ రేణిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


అద్దేపల్లి గంగరాజు సత్రం ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సేవా సంస్థలు, ఫౌండేషన్‌ల ద్వారా అనేక సహాయ సహకారాలు అందుతాయని అద్దేపల్లి గంగరాజు సత్రం సభ్యులు ఆచారి అన్నారు. మంగళవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో దేవదాయ ధర్మాదాయ శాఖ అద్దేపల్లి గంగరాజు సత్రం, అద్దేపల్లి మోహన్‌దాస్ ఫౌండర్ అండ్ ఫ్యామిలీ చైర్మన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ అద్దేపల్లి గంగరాజు సత్రం ద్వారా విద్యార్థులకు ఉచిత భోజనం, పుస్తకాలు, ఉచిత హోమియో మందులు మహిళలకు దుస్తులు వంటివి అందజేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, మంతెన సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో ద్విచక్రవాహనాల అమరికపై శిక్షణ


భీమవరం డీఎన్నార్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్విచక్ర వాహనభాగాలను అమర్చడం, విడదీయడం అనే అంశంపై రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యమహా షోరూమ్ సర్వీస్ మేనేజర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ వాహనాల్లోని ముఖ్యమైన భాగాలు, వాటి విధులు, సాధారణ సమస్యల పరిష్కారంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంజిన్‌లోని లోపాలను గుర్తించడం, ఇంజిన్ అమర్చేటపుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. అలాగే అసెంబ్లింగ్ చేసేటప్పుడు ప్యాకింగ్ సెట్, ఇంజిన్ ఆయిల్ ఉపయోగించే విధానం, ఫోర్ స్ట్రోక్ ఇంజన్ హెడ్ సమగ్ర పరిశీలన, వాల్వ్ టైమింగ్ సెట్టింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్, మెకానికల్ హెచ్‌ఓడి ఐ.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఎదుగుదలపై శ్రద్ధ అవసరం

ఉండి: కిశోర బాలికల ఎదుగుదలపై ప్రతి తల్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. మంగళవారం మహదేవపట్నంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికల ఎదుగుదలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఆడబిడ్డ ఎదిగే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించాలన్నారు. మంచి చదువులు చదివించాలని సూచించారు.